క్లుప్తంగా

కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్

మాజీ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి



బీమా చెక్కు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కల్హేర్(నారాయణఖేడ్): కార్యకర్తలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని మీర్ఖాన్‌పేటలో బీఆర్ఎస్ కార్యకర్త కూలి శేఖర్ మృతి చెందడంతో భార్య పద్మకు పార్టీ సభ్యత్వం తరఫున రూ. 2 లక్షల బీమా చెక్కును అందజేశారు. రాపర్తిలో మృతి చెందిన చాకలి లింగమయ్య, చాందుపాషా, సంగమ్మ కుటుంబాలను పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ కోఆప్షన్ సభ్యులు అలీ, మాజీ రైతుబంధు అధ్యక్షుడు దుర్గరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సంగారెడ్డి, మాజీ సర్పంచ్ శ్రావణ్‌కుమార్, నాయకులు యకోబ్, భూమయ్య పాల్గొన్నారు.

వృథాగా మిషన్ భగీరథ నీరు



రోడ్డుపై పారుతున్న భగీరథ నీరు

జహీరాబాద్ టౌన్: బీఆర్ఎస్ ప్రభుత్వం కోట్లాది రుపాయలు ఖర్చుపెట్టి తీసుకొచ్చిన మిషన్ భగీరథ పథకంపై పర్యవేక్షణ కరువైందని ప్రజలు విమర్శిస్తున్నారు. పట్టణంలోని పస్తాపూర్ చౌరస్తాలో మిషన్ భగీరథ పైప్‌లైన్ నుంచి నీరు లీకేజీ అవుతుంది. నీరంతా వృథాగా రోడ్డుపై పారుతోంది. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు. పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నూతన నియామకం

హత్నూర(సంగారెడ్డి): బీజేపీ జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శిగా రెండోసారి హత్నూర మండలం బోర్పట్ల గ్రామానికి చెందిన గునుకుంట్ల కమలాకర్‌ను ఆదివారం నియామించారు. ఈ సందర్భంగా ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు వాసు నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం కమలాకర్ మాట్లాడుతూ.. రెండోసారి అవకాశం కల్పించడంపై సంతోషం వ్యక్తం చేశారు. నరేంద్ర మోదీ నాయకత్వంలో పార్టీకి సేవకుడిగా పని చేస్తానని తెలిపారు.



ఎస్సీసెల్ జిల్లా కార్యదర్శిగా కమలాకర్

ఖేడ్‌లో పరిశుభ్రత పనులు



వీధులను శుభ్రం చేస్తున్న కార్మికులు

నారాయణఖేడ్: పట్టణంలో 'స్వచ్ఛతా హీ సేవ' లో భాగంగా ఆదివారం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో 'స్వభావ్ స్వచ్ఛత- సంస్కార్ స్వచ్ఛత' కార్యక్రమం నిర్వహించారు. శానిటరీ అధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్థానిక గిరిజన బాలికల వసతిగృహం సమీపంలో రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్తను మున్సిపల్ కార్మికులు, యువకులతో కలిసి తొలగించారు. అనంతరం స్వచ్ఛత విషయంపై అవగాహన కల్పించారు.

భక్తిశ్రద్ధలతో 'నగర సంకీర్తన'



భజనలు, కీర్తనలు ఆలపిస్తున్న భక్తులు

జహీరాబాద్ టౌన్: హరే కృష్ణ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నగర సంకీర్తన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. హనుమాన్ మందిరం నుంచి భజనలు, కీర్తనలు ఆలపిస్తూ కాలనీలో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. నగర సంకీర్తనకు ప్రతివారం మంచి స్పందన వస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ పాల్గొనాలని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం భక్తులకు అల్పాహారం అందచేశారు.

నేడు ఉపాధిహామీ ప్రజాదర్బార్

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ మండల పరిషత్తు వద్ద సోమవారం ఉ.10 గంటలకు ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ ప్రజాదర్బార్ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మల్సూర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు, కూలీలు, ఈజీఎస్ సిబ్బంది హాజరు కావాలని కోరారు.

భారీ వర్షాలు.. దెబ్బతిన్న పంటలు

- నీటమునిగిన పంటలు
- ఆందోళన చెందుతున్న రైతులు

జిల్లాలో కురిసిన భారీ వర్షాలు రైతాంగానికి తీవ్ర నష్టాన్ని కలిగించాయి. వందలాది ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. పెసర, మినుము పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. కోతకు వచ్చి సమయంలో వర్షాలు పడడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వరద నష్టంపై అధికారులు, ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో పర్యటించి, నివేదికల తయారు చేసి ప్రభుత్వానికి పంపారు. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులను వేడుకుంటున్నారు.



చెరకు తోటలో చేరిన నీరు



దొండ తోట పాదుల్లో నిలిచిన వరదనీరు

జహీరాబాద్ టౌన్: కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయి. చెరువులు, కుంటలన్నీ నిండుకుండల్లా మారాయి. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. పలు చోట్ల పంటలు దెబ్బతినగా లోతట్టు ప్రాంతాల్లో చేతికొచ్చిన పంటలు నీట మునిగాయి. ప్రధానంగా పెసర, మినుము పూర్తిగా దెబ్బతిన్నాయి. కోతకు వచ్చి సమయంలో భారీ వర్షాలు పడడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కంది, పత్తి, సోయా, చెరకు పంటలు కూడా దెబ్బతిన్నాయి.

జహీరాబాద్ డివిజన్ పరిధిలో జహీరాబాద్, మొగుడంపల్లి, న్యాల్‌కల్, ఝరాసంగం, కోహీర్ మండలాలు ఉన్నాయి. ఆయా మండలాల్లో సుమారు 1.95 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సీజన్‌లో రైతులు పంటలు వేశారు. భారీ వర్షాలకు డివిజన్‌లోని 3 వేల పైగా రైతులకు సంబంధించి సుమారు 5 వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. జహీరాబాద్ మండలంలో 2500, న్యాలకల్‌లో 1200, కోహీర్‌లో 300, ఝరాసంగంలో 780 , మొగుడంపల్లి మండలంలో 220 ఎకరాల్లో ఖరీఫ్ పంటలు దెబ్బతిన్నాయి. కూరగాయలు, పూల తోటలు కూడా చాలా వరకు ధ్వంసమయ్యాయి. వారం రోజుల నుంచి గ్యాప్ ఇచ్చిన వానలు మళ్లీ కురడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. దెబ్బతిన్న పంటలకు సంబంధించి వ్యవసాయ అధికారులు ప్రాథమిక నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపారు. అయితే, ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితిలేనందున పరిహారం చెల్లించాలని వేడుకుంటున్నారు.

నివేదిక పంపాం..

భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలకు సంబంధించి వివరాలను సేకరించి, ప్రాథమికంగా నివేదికలను తయారు చేసి అధికారులకు పంపాం. పూర్తిస్థాయి నివేదికను తయారు చేస్తున్నాం.. పొలంలో నీరు నిల్వ ఉంటే చీడపీడల బెడద పెరుగుతుంది. వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు తీసుకోవాలి.

–భిక్షపతి, ఏడీఏ, జహీరాబాద్

సభ్యత్వ నమోదుతో సత్తాచాటాలి



సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న బీబీపాటిల్

మాజీ ఎంపీ బీబీపాటిల్

నారాయణఖేడ్: సభ్యత్వ నమోదులో బీజేపీ కార్యకర్తలు సత్తాచాటాలని జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీ పాటిల్ పేర్కొన్నారు. నిజాంపేట్ మండల కేంద్రంలో ఆదివారం సభ్యత్వ నమోదును పార్టీ అధికార ప్రతినిధి జన్‌వాడ సంగప్ప, మాజీ ఎమ్మెల్యేలు నందీశ్వర్‌గౌడ్, విజయపాల్‌రెడ్డిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్యకర్తలు కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి సభ్యత్వ నమోదును జయప్రదం చేయాలన్నారు. ప్రతి బూత్‌స్థాయిలో 200, మండల స్థాయిలో 10 వేలకు తగ్గకుండా సభ్యత్వాలు నమోదు చేయించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ రజినీకాంత్, జిల్లా ఉపాధ్యక్షుడు రామకృష్ణ, ఎస్టీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజురాథోడ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాయిరాం , న్యాయవాది బస్వరాజ్‌పాటిల్, మండల అధ్యక్షుడు సింధోల్ దశరథ్ పాల్గొన్నారు. అనంతరం ఖేడ్ మండలంలోని పోతన్‌పల్లిలోనూ బీజేపీ సభ్యత్వ నమోదును ప్రారంభించారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలు మంజూరు చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న గణపతి

నారాయణఖేడ్: పెండింగ్‌లో ఉన్న ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలను వెంటనే మంజూరు చేయాలని దళితహక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గణపతి డిమాండ్ చేశారు. ఖేడ్‌లో ఆదివారం నిర్వహించిన సంఘం జిల్లాస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. స్వయం ఉపాధి కోసం ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు సంబంధించిన రాయితీని విడుదల చేయాలన్నారు. కొత్తగా దరఖాస్తులకు అవకాశం కల్పించాలన్నారు. జనాభా ఆధారంగా దళితుల అభివృద్ధి, సంక్షేమానికి నిధులు కేటాయించాలని కోరారు. ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. సాధారణ జనగణనతో పాటు సామాజిక, ఆర్థిక కులగణన చేపట్టాలన్నారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్, డివిజన్ నాయకులు రాము, సతీష్, ఆనందం తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

నారాయణఖేడ్: కిరాణా వస్తువులు కొనుగోలుకు బయటకు వెళ్లిన యువకుడు అదృశ్యమైనట్లు నాగల్‌గిద్ద ఎస్ఐ బి.సాయిలు తెలిపారు. కర్ణాటక రాష్ట్రం ఔరాద్ తాలూకా ఘమాతండాకు చెందిన పవార్ ప్రకాశ్ (35), కుటుంబం ఉపాధి నిమిత్తం మండలంలోని ఇరక్‌పల్లి తండాకు వచ్చింది. తండా సమీపంలో హోటల్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 10న కిరాణా వస్తువులు కొనుగోలు చేసుకుని వస్తానని చెప్పి వెళ్లి, ఇంటికి తిరిగి రాలేదు. బంధువులు, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో, పవార్ ప్రకాష్ భార్య మారణిబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.



పవార్ ప్రకాశ్ (ఫైల్)

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



మునిపల్లి: తాటిపల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాల పూర్వవిద్యార్థులు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మండల పరిధిలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో శ్రీవాణి హైస్కూల్ (2004–2005)బ్యాచ్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థులు ఆదివారం కలుసుకొని ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని సంతోషం వ్యక్తం చేశారు. 19 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు.



పటాన్‌చెరు టౌన్: శ్రీవాణి హైస్కూల్‌లో..

మునిపల్లిలో..

మునిపల్లి(అందోల్): మండలంలోని తాటిపల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాల (2004–2005) బ్యాచ్ పదొవ తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఆనందించారు. అంతకుముందు ప్రధానోపాధ్యాయులు అంబయ్య, ఉపాధ్యాయులు అనిత, శ్రీనివాస్, నాయుడుకు శాలువా కప్పి సన్మానించారు.

సంక్షిప్త వార్తలు

◆ కార్మికుల సమస్యలపై ఉద్యమం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): నాన్ పర్మినెంట్ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. ఆదివారం రామచంద్రాపురం పట్టణంలోని బాలాజీ ఫంక్షన్ హాల్‌లో తోషిబా పరిశ్రమల్లో సీఐటీయూ విజయం సాధించిన సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంట్రాక్ట్, క్యాజువల్, టెంప్రవరీ కార్మికుల పేరిట దోపిడీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టపరంగా రావాల్సిన ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు ఇవ్వడం లేదన్నారు. వీరి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 28న కలెక్టర్ కార్యాలయం ఎదుట వారి ధర్నా చేపడుతున్నట్లు చెప్పారు. 30న చలో లేబర్ కమిషనర్ కార్యక్రమానికి పిలుపునిస్తున్నట్లు తెలిపారు. తోషిబాలో సీఐటీయూ గెలవడానికి ఆయన అభినందించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు మల్లికార్జున్, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి భూపాల్, నాయకులు రాజయ్య పాల్గొన్నారు.

◆ బయో ఎరువులతో లబ్ధి

జహీరాబాద్: పంటలకు బయో ఎరువుల వాడకంపై రైతులు ఆసక్తి చూపాలని ప్రిస్మ్ కంపెనీ ప్రతినిధులు సూచించారు. ఈ సందర్భంగా ఆదివారం ఆ సంస్థ డైరెక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ.. రైతులు పంటలకు మితిమీరి రసాయన ఎరువులు వాడుతున్నారని అన్నారు. ఇలా వాడడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. బయో ఎరువుల వాడకంతో దిగుబడులు పొందవచ్చన్నారు. పంటలకు తగిన మోతాదులో బయో ఎరువులు వాడాలని, నాలుగు దశల్లో వాడకం వల్ల మంచి ఫలితాలను సాధించవచ్చని వివరించారు. సమావేశంలో జీఎం రవీందర్‌రెడ్డితో పాటు పాండురంగం, సురేందర్, శ్రీనివాస్‌రెడ్డి, మల్లేశ్, ఆయా మండలాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

◆ నేడు సబ్సిడీ గ్యాస్ పత్రాల పంపిణీ

మునిపల్లి(అందోల్): మహాలక్ష్మి పథకంలో భాగంగా ప్రభుత్వం సబ్సిడీ గ్యాస్ పత్రాలు అందజేయనున్నట్లు రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం ఉ.11.30 గంటలకు లబ్ధిదారులకు మహాలక్ష్మి పథకానికి సంబంధించిన పత్రాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

◆ ఆరోగ్య కేంద్రానికి నిధులు మంజూరు

మునిపల్లి(అందోల్): కంకోల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మ రూ. 2.45 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సతీష్ కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు మంత్రి నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. త్వరలోనే ఆరోగ్య కేంద్రం పనులు ప్రారంభమవుతాయన్నారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ్మకు మండల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

◆ పెన్షన్ రూ.6000లకు పెంచాలి

సంగారెడ్డి, ఎడ్యుకేషన్: దివ్యాంగుల చట్టాలను అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా గౌరవ అధ్యక్షుడు మాణిక్యం వ్యాఖ్యానించారు. ఆదివారం సంగారెడ్డిలోని కేవల్‌కిషన్ భవన్‌లో దివ్యాంగులు కమిటీ జిల్లా విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాణిక్యం మాట్లాడుతూ.. ప్రభుత్వ, ప్రభుత్వేతర సౌకర్యాలు వికలాంగులకు అందడం లేదన్నారు. రాష్ట్రంలో 43.02 లక్షల మంది వికలాంగులు ఉంటే పెన్షన్ కేవలం 5.75లక్షల మందికే వస్తుందన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న వికలాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులను ప్రకటించి, ప్రత్యేక నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. దివ్యాంగుల పెన్షన్ రూ.6000లకు పెంచకుంటే రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు అడివయ్య, ఉపాధ్యక్షుడు జయలక్ష్మి, నర్సింలు, జిల్లా సహాయ కార్యదర్శులు రాంచందర్, నాయకులు పాల్గొన్నారు.

పేదలకు ఆపన్నహస్తం సీఎంఆర్ఎఫ్

ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: సీఎం సహాయనిధి నిరుపేదలకు ఆపన్నహస్తం అందిస్తోందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని 118 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ. 43 లక్షల సీఎం సహాయ నిధి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిరుపేదల సంక్షేమం, ఆర్థిక అభ్యున్నతి లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి పనిచేస్తున్నారని అన్నారు. పూర్తి పారదర్శకతతో ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రజా పాలన అందిస్తున్నామన్నారు. త్వరలో అర్హులకు తెల్లరేషన్ కార్డులు ఇవ్వనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నగేశ్ యాదవ్, నరసింహారెడ్డి, వెంకటేశ్, రాము, రాజు, సంజీవరెడ్డి, ఇమ్రాన్ పాల్గొన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

చెక్కు అందజేత

మునిపల్లి(అందోల్): సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.14 వేల చెక్కును మాజీ ఎంపీపీ రాంరెడ్డి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. మండలంలోని తాటిపల్లి గ్రామానికి చెందిన దుర్గయ్య కుటుంబ సభ్యురాలు లక్ష్మమ్మకు కాంగ్రెస్ నాయకుడు వెంకట లక్ష్మారెడ్డి , అంజిరెడ్డి ఆధ్వర్యంలో చెక్కును అందజేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ పెంటయ్య, మధుకర్, రాములు పాల్గొన్నారు.

'మహాలక్ష్మి'తో ప్రయోజనం

న్యాల్‌కల్(జహీరాబాద్): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం మహిళల జీవితాల్లో వెలుగులు నింపుతోందని డీసీసీ ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కొత్తపల్లి భాస్కర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని తాట్‌పల్లి గ్రామంలో మహాలక్ష్మి పథకం లబ్ధిదారులకు సబ్సిడీ గ్యాస్ ప్రొసీడింగ్ పత్రాలు, గ్రామానికి చెందిన నర్సమ్మకు రూ.60వేలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. ప్రతి పక్షాలు చెప్పే అబద్ధాలను ప్రజలు నమ్మొద్దని చెప్పారు. తమ గ్రామాన్ని నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయడంలో ప్రత్యేక చొరవ చూపిన భాస్కర్‌రెడ్డిని గ్రామస్తులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



గ్యాస్ ప్రొసీడింగ్ పత్రాలను అందజేస్తున్న భాస్కర్‌రెడ్డి

వాటర్ ట్యాంకులకు క్లోరినేషన్

నారాయణఖేడ్: వర్షాకాలంలో తాగునీటి కలుషితం, ట్యాంకుల వద్ద అపరిశుభ్రత వల్ల వివిధ రకాల వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, చైర్మన్ ఆనంద్ స్వరూప్‌షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్ అన్నారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధిలో కమిషనర్ జగ్జీవన్ ఆదేశాలతో క్లోరినేషన్, పరిశుభ్రత పనులను చేపట్టారు. మున్సిపాలిటీ పరిధిలోని నీటిట్యాంకుల్లో కార్మికులు క్లోరిన్ వేసి శుభ్రం చేశారు. ట్యాంకుల చుట్టూ, వాల్వుల వద్ద పెరిగిన ముళ్ల పొదలు, పిచ్చిమొక్కలను తొలగించారు.



ట్యాంకులో క్లోరిన్ వేస్తున్న కార్మికుడు

నూతన మత్స్యకార సంఘం ఏర్పాటు

పటాన్‌చెరు టౌన్: జిన్నారం మండలం ఊట్ల గ్రామ పంచాయతీ మత్స్యశాఖ సంఘంలో 20 సంవత్సరాల నుంచి నడుస్తున్న సమస్యకు రెండు గ్రామాల ప్రజలు పరిష్కారం చేసుకున్నారు. ఆదివారం కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్‌ను చిట్కుల్ ఎన్ఎంఆర్ కార్యాలయంలో సంఘం సభ్యులు కలిసి, ఆయన చేతుల మీదుగా ఊట్ల మత్స్యశాఖ సంఘం నుంచి ఐదు కుంటలను, దాదిగూడ గ్రామానికి సంబంధించి నూతనంగా ఏర్పాటైన మత్స్యశాఖ సంఘం సభ్యులు పత్రాలు అందుకున్నారు. పూర్తి ప్రక్రియకు సహకరించిన నీలం మధు ముదిరాజ్‌కి సంఘం సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వావిలాల సింగిల్ విండో మాజీ చైర్మన్ మాణిక్యరావు ముదిరాజ్, సంగారెడ్డి జిల్లా మత్స్యశాఖ డైరెక్టర్ మహేశ్ ముదిరాజ్, దాదిగూడ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు రమేష్ ముదిరాజ్, సంఘం నాయకులు సత్యనారాయణ, శ్రీనివాస్, భిక్షపతి, శ్రీనివాస్, దేవేందర్ గ్రామస్తులు పాల్గొన్నారు.



నియామక పత్రాలు అందుకున్న మత్స్యకారులు

పెండింగ్ డీఏలను విడుదల చేయండి

సంగారెడ్డి, ఎడ్యుకేషన్: పెండింగ్ డీఏలను తక్షణమే విడుదల చేయాలని టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం రాత్రి టీపీటీఎఫ్ మండల నూతన కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన రేషనలైజేషన్ జీఓలు అసంబద్ధంగా ఉండడం వల్ల విద్యారంగానికి తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్ రాష్ట్ర కౌన్సిలర్ మర్పల్లి లక్ష్మయ్య యాదవ్ ఉపాధ్యక్షుడు రవీందర్, రాములు, కార్యదర్శులు ప్రదీప్, రాములు, చంద్రయ్య జిల్లా కౌన్సిలర్‌లు జగన్నాథం, పుండరీకం, నర్సింలు, వెంకటేశ్, ఆడిట్ కమిటీ కన్వీనర్లు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న టీపీటీఎఫ్ నాయకులు

ఘనంగా ఫ్రెషర్స్ డే

సంగారెడ్డి రూరల్: సంగారెడ్డిలోని సెంట్ ఆంథోనీస్ మహిళా డిగ్రీ కళాశాలలో ఆదివారం 'నెక్స్‌జెన్ నోవిసెస్' పేరుతో ఫ్రెషర్ డే కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గత సెమిస్టర్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు మెరిట్ సర్టిఫికెట్లు, మెమొంటోలు, మెడల్స్ అందచేశారు. అలాగే, విద్యార్థినులకు మిస్ బ్యూటీ, వివిధ ఆటల పోటీలు నిర్వహించి, గెలుపొందినవారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సెంట్ ఆంథోనీస్ అధినేత సాల్మన్‌రెడ్డి, జయబాలారెడ్డి, విజయకుమార్‌రెడ్డి, అరుణరెడ్డి, జవహర్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



బహుమతులు అందుకున్న విద్యార్థినులు

జాతీయ రహదారిపై గుంతలు



సంగారెడ్డి చౌరస్తాలో ఏర్పడిన గుంతలు

సంగారెడ్డి జోన్: ఇటీవల కురిసిన వర్షాలకు ముంబై- హైదరాబాద్ జాతీయ రహదారి గుంతలమయంగా మారింది. ఈ రహదారి హైదరాబాద్ నుంచి సంగారెడ్డి, జహీరాబాద్ పట్టణాల మీదుగా వెళ్తోంది. నిత్యం వేలాది సంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. సంగారెడ్డి చౌరస్తా వద్ద పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. అంతేకాక, లింగంపల్లి వరకు అక్కడక్కడ గుంతలు ఉన్నాయి. దగ్గరకు వచ్చేంతవరకు గుంతలు కనిపించడం లేదు. దీంతో వాహనాలు పాడవుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. గుంతలు ఏర్పడి రోజులు గడుస్తున్నా వాటిని పూడ్చడంలో అధికారులు విఫలమవుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గుంతలను పూడ్చాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.